క్లుప్తంగా

సర్పంచు మోనాలిసాను సన్మానించిన విశ్వ



సర్పంచ్ మోనాలీసాను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ (వజ్రకరూరు): ఢిల్లీలో జరిగిన శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించుకొని ఉత్తమ సర్పంచ్ అవార్డు అందుకున్న వజ్రకరూరు మేజర్ పంచాయతీ సర్పంచ్ మోనాలీసాను మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి శుక్రవారం సన్మానించారు. పార్టీ ముఖ్యనేతలు ఎంపీపీ దేవిబాయి, మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, ఉస్మాన్, శ్యాం, చాబాల సర్పంచ్ జగదీష్ సమక్షంలో సన్మానించారు.

కక్షసాధింపు చర్యలు తగవు



మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

రాయదుర్గంటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులపై మున్సిపల్ కమిషనర్ కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున విమర్శించారు. ఇంజనీరింగ్ కార్మికుల పని ప్రదేశాలను మార్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, కార్మికుల పని స్థానాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కార్మికులు నిరసన తెలియజేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు.

చిరుత సంచారంతో భయాందోళన



రాయదుర్గం సమీపంలోని చెక్‌పోస్టు వెనుక కొండపై కనిపించిన చిరుత

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డు చెక్ పోస్టు సమీపంలోని కొండపై చిరుత సంచారంతో ఆ ప్రాంత కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. శుక్రవారం సాయంత్రం కొండపైన పెద్ద రాతి గుండుపై చిరుత కనిపించిందని స్థానికులు తెలిపారు. వారం రోజుల క్రితం కూడా ఇదే ప్రాంతంలో కొండపై చిరుత కనిపించిందన్నారు. కొండ దిగువతోపాటు పైతోట ప్రాంతానికి మేకలు, ఆవులు, దూడలు మేతకు వెళ్తాయని, దీంతో చిరుతల సంచారం ఉండొచ్చని స్థానికులు భావిస్తున్నారు.

కర్ణాటక మద్యం ధ్వంసం



కర్ణాటక మద్యం ధ్వంసం చేస్తున్న అధికారులు

కణేకల్లు: వివిధ కేసుల్లో పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని కణేకల్లు ఎక్సైజ్ అధికారులు శుక్రవారం ధ్వంసం చేశారు. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో సుమారు రూ.1.76 లక్షల విలువ చేసే కర్ణాటక మద్యం ధ్వంసం చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ఉమాబాయి, ఎస్ఐ షేక్షావలి, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీలో కోతులు దాడి చేస్తున్నా స్పందించరా?



మాట్లాడుతున్న విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి

కూడేరు: కూడేరు కేజీబీవీలోకి కోతులు చొరబడి బాలికలు, ఉపాధ్యాయినులపై దాడి చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోరా? అని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం కూడేరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేజీబీవీలో 200 మంది వరకు బాలికలు ఉన్నారన్నారు. నెల రోజులుగా కోతులు చొరబడి బాలికలు, ఉపాధ్యాయినులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలోనూ కేజీబీవీ సిబ్బంది ఫిర్యాదు చేశారని, అయినా ఎవరూ స్పందించలేదన్నారు. సంబంధిత అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి బాలికలు, ఉపాధ్యాయినులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి నిశాంత్ రెడ్డి, అనంతపురం నగర అధ్యక్షుడు కైలాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

రాయదుర్గంటౌన్: అత్యవసర సమయాల్లో కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందిన నియోజకవర్గంలోని దాదాపు 26 మందికి సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.17 లక్షల చెక్కులు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అందజేశారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేశారు.

‘దుర్గం’లో హడలెత్తించిన ఏసీబీ దాడులు

- అవినీతి అధికారుల్లో గుబులు
- రెవెన్యూ, పోలీసు శాఖల్లోనూ కలవరం
- పలు శాఖలపై ఇప్పటికే నిఘా ఉంచిన ఏసీబీ




గురువారం రాత్రి కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చెందిన పలు కీలక ఫైళ్లను తీసుకెళ్తున్న దృశ్యం, కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలోని పలు శాఖల్లో ఉన్న అవినీతి అధికారుల్లో గుబులు పట్టుకుంది. కళ్యాణదుర్గంలో అవినీతి అధికారులపై ఏసీబీ దాడులు హడలెత్తిస్తున్నాయి. విధి నిర్వహణలో ప్రభుత్వం ఇచ్చే వేతనాలతో పాటు అత్యాశతో అదనపు సంపాదన కోసం ఆరాటపడుతున్న అధికారులకు ఏసీబీ ముచ్చెమటలు పట్టిస్తోంది. ఈనేపథ్యంలో కళ్యాణదుర్గంపై ఏసీబీ ప్రత్యేక నిఘా ఉంచినట్లు సమాచారం.

అవినీతికి కేరాఫ్..సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ పరిధిలో ఏసీబీ అధికారులు దాడులు చేయడంతో అవినీతి అధికారుల్లో వణుకుపుడుతోంది. రెండేళ్ల క్రితం అప్పట్లో పనిచేసిన సబ్‌రిజిస్ట్రార్ రామ్మోహన్ బెళుగుప్ప మండలంలోని ఓ గ్రామానికి చెందిన రైతు పొలానికి సంబంధించి డాక్యుమెంట్‌లో వారసులను మార్చేసి భూ యజమానులతో రూ.లక్షలు దండుకొని రెండోసారి రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై అప్పట్లో పెద్ద దుమారమే రేగింది. ఉన్నతాధికారులు విచారణ జరిపి ఆయన్ను సస్పెండ్ చేశారు. తిరిగి ఇటీవల కళ్యాణదుర్గం ప్రాంతంలోని ఓ గ్రామానికి చెందిన రైతుకు చెందిన భూమి ల్యాండ్ కన్వర్షన్‌కు రూ.5 లక్షలు లంచం తీసుకుంటూ ప్రస్తుత ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ నారాయణస్వామి ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఇలా ఒక్క కళ్యాణదుర్గం రెవెన్యూ పరిధిలోని రైతుల ఫిర్యాదుతోనే ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు చిక్కుల్లో పడ్డారంటే.. అధికారులు ఏ మేర అవినీతికి పాల్పడుతున్నారో ఇట్టే అర్థమవుతుంది.

డాక్యుమెంట్ రైటర్లలోనూ భయం...

ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ నారాయణస్వామిని ఏసీబీ అధికారులు ట్రాప్ చేయడంతో కళ్యాణదుర్గంలోని డాక్యుమెంట్ రైటర్లలో భయం పట్టుకుంది. అనంతపురంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు.. రాత్రికి రాత్రే కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తీసుకురావడంతో ఒక్కసారిగా అందరిలోనూ టెన్షన్ నెలకొంది. రాత్రి 11 గంటల సమయంలోనూ కార్యాలయంలోనే పలు ఫైళ్లను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే రైతులకు చెందిన భూమి బదలాయింపులో సబ్ రిజిస్ట్రార్‌కు సహకరించిన డాక్యుమెంట్ రైటర్లలో సైతం భయం పట్టుకున్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు ఇటీవల కళ్యాణదుర్గం, కంబదూరు, బ్రహ్మసముద్రం తహసీల్దార్ల సంతకాలు ఫోర్జరీ జరిగిన తతంగంపైనా ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ వ్యవహారంలో డాక్యుమెంట్ రైటర్ల ప్రమేయంపైనా కూపీ లాగుతున్నట్లు సమాచారం.

రెవెన్యూ, పోలీసు శాఖల్లోనూ వణుకు..

కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌ను ఏసీబీ ట్రాప్ చేయడంతో దుర్గంలోని రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖల్లో సైతం కలవరం మొదలైంది. కళ్యాణదుర్గం పోలీస్ సబ్ డివిజన్‌లోని ఓ మండల పోలీసు అధికారిపై ఇప్పటికే ఏసీబీ కన్ను పడినట్లు సమాచారం. అదేవిధంగా రెవెన్యూ శాఖలో సైతం గత ఏడాది క్రితం భూ సమస్యలలో రైతుల వద్ద నుంచి అధిక మొత్తంలో అవినీతికి పాల్పడ్డారనే అభియోగంతో తహసీల్దార్, వీఆర్వోల గదులను ఏసీబీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించడం అప్పట్లో చర్చనీయాంశమైంది. అయితే ఆయా శాఖల్లో అవినీతికి పాల్పడుతున్న అధికారులపై ఏసీబీ అధికారులు నిఘా ఉంచినట్లు సమాచారం. ఏది ఏమైనా అవినీతికి పాల్పడుతున్న అధికారులకు ఏసీబీ దాడులు కంటిని కునుకు లేకుండా చేస్తున్నాయనే చెప్పవచ్చు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశాలు

రాయదుర్గం: నియోజకవర్గంలోని డి హీరేహాళ్, రాయదుర్గం మండలాల్లో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశాలు శనివారం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్లు రవీంద్రనాథ్‌రెడ్డి, జీ రామాంజనేయులు తెలిపారు. ముఖ్య అతిథిగా సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి హాజరవుతారన్నారు. ఉదయం 10:30 గంటలకు డి హీరేహాళ్ మండలం సోములాపురం, సాయంత్రం 4 గంటలకు రాయదుర్గం మండలం వడ్రవన్నూరులో సమావేశాలు జరిపేలా షెడ్యూల్ తయారు చేశామన్నారు. మండలంలోని అన్ని అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

31లోపు బీమా ప్రీమియం చెల్లించాలి

కూడేరు: వాతావరణ బీమా పథకం కింద వేరుశనగ, పత్తి, దానిమ్మ, బత్తాయి, టమాట, అరటి పంటలకు ప్రీమియం ఈ నెల 31లోపు చెల్లించాలని ఏఓ శుభకర్ రైతులకు సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద కంది, పప్పుశనగ, ఎర్ర మిరప, జొన్న, మొక్కజొన్న, ఆముదం పంటలకు ఈ ఆగస్టు 15 లోపు ప్రీమియం చెల్లించాలన్నారు. వేరుశనగకు ఎకరాకు రూ.640, దానిమ్మకు రూ.3,750, బత్తాయి, చీనీకి రూ.2,750, టమాటకు రూ.1,600, అరటికి రూ.3వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలపై నిలదీత



సర్వసభ్య సమావేశంలో అధికారుల తీరుపై నిలదీస్తున్న ఎంపీపీ కరణం పుష్పావతి

విడపనకల్లు: మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు ప్రజా సమస్యలపై అధికారులను నిలదీశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీపీ కరణం పుష్పావతి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా సర్వసభ్య సమావేశానికి కొందరు అధికారులు గైర్హాజరు కావడంపై సభ్యులు మండిపడ్డారు. మూడు నెలలకోసారి జరిగే సర్వసభ్య సమావేశానికి కూడా అధికారులు రాకపోతే ఎలా? అని అసహనం వ్యక్తం చేశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్చిద్దామంటే సంబంధిత అధికారులు హాజరుకాకపోవడం సరికాదన్నారు. ఇటీవల ఉచిత కందులు ఎంత మంది రైతులకు ఇచ్చారని వ్యవసాయాధికారులను నిలదీశారు. ఆర్‌ఎస్‌కేల్లో ఎరువులు, మందులు అందుబాటులో ఉంచకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి పథకాలపైనా సభ్యులు అడిగారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షకీలాబేగం, జెడ్పీటీసీ హనుమంతు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఏఓ భాస్కర్, ఉపాధి హామీ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు హాజరయ్యారు.

బాబును నమ్మితే మోసం గ్యారెంటీ

- కూటమి మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరిద్దాం
- వైఎస్సార్‌సీపీ ఉరవకొండ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి



విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న పట్టణ, రూరల్ నాయకులు



ఉరవకొండలో ‘బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ’ లోగోను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ, పార్టీ నేతలు

ఉరవకొండ: సార్వత్రిక ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ పథకాలతో ప్రచారం చేసిన చంద్రబాబు... అధికారంలోకొచ్చిన తర్వాత ఏ ఒక్కటీ అమలు చేయలేదని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. చంద్రబాబును నమ్మితే మోసం గ్యారంటీ అన్నారు. కూటమి పాలకులు చేసిన మోసాలపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఉరవకొండ పట్టణ, రూరల్ మండలాల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈసందర్భంగా సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు రూ.1500 అంటూ ఎన్నో హామీలిచ్చి, అధికారంలోకి వచ్చి ఏడాదైనా వాటిని అమలు చేయకుండా మోసం చేశారని విమర్శించారు. నమ్మి ఓట్లేసిన ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమన్నారు. రాష్ట్రంలో భయానక వాతావరణం సృష్టించి లేని లిక్కర్ స్కాంను తెరమీదకు తెచ్చి పార్టీ ముఖ్యనేతలను అరెస్టులు అయ్యేలా చేయడమే లక్ష్యంగా కూటమి పాలన సాగుతుందన్నారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా భయపడేది లేదన్నారు.

‘అనుబంధ’ నాయకులకు నియామక పత్రాలు..

పార్టీ అనుబంధ కమిటీల్లో చోటు దక్కించుకున్న ఉరవకొండ పట్టణ, రూరల్ నాయకులకు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి పత్రాలు అందించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, ఎంపీపీ నరసింహులు, వైస్ ఎంపీపీ ఈడిగ ప్రసాద్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరన్న, పార్టీ రూరల్ కన్వీనర్ ఎర్రిస్వామిరెడ్డి, మండల సమన్వయకర్త ఓబన్న, సర్పంచ్ మీనుగ లలితమ్మ, ఓబుళమ్మ, వసంతమ్మ, పార్టీ రాష్ట్ర నాయకులు బసవరాజు, ఏసీ ఎర్రిస్వామి, సింగాడి తిప్పయ్య, జిల్లా నాయకులు యోగేంద్రరెడ్డి, జోగి వెంకటేష్, లత్తవరం గోవిందు, పచ్చిరవి, నిమ్మల వెంకటరమణ, అంగదాల అంజి, రూరల్ నాయకులు ధనుంజయ, ఈశ్వర్, లింగన్న, నాగరాజు, సర్పంచ్ సిద్ధార్థ్, మీనుగ గంగాధర్, విక్కీ, మైనార్టీ నాయకులు జీఎంఎస్ మీరంబాషా, మైనుద్దీన్, శర్మాస్, షేక్షావలి, తయ్యాబ్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

ఏరు దాటాక తెప్ప తగలేసే నైజం



బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ లోగో ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ, పార్టీ నేతలు

ఉరవకొండ (వజ్రకరూరు): చంద్రబాబు ఏరుదాటక తెప్పతగలేసే రకమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. శుక్రవారం స్థానిక మాజీ ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి జిన్నాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కమలపాడు రాజశేఖర్‌రెడ్డి జిన్నాల్లో పార్టీ మండల అధ్యక్షుడు బిందెల సోమశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చాక పథకాల అమలును గాలికొదిలేశారని విమర్శించారు. ఇచ్చిన హామీల్లో ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం ఫ్లాప్ అయ్యిందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేదని, రైతు భరోసా, ఇన్సూరెన్స్ పథకాలను చంద్రబాబు ఎగ్గొట్టారన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ లోగోను ఆవిష్కరించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరన్న మాట్లాడారు. ఎంపీపీ దేవిబాయి, మేజర్ పంచాయతీ సర్పంచ్ మోనాలీసా, పార్టీ మండల ఉపాధ్యక్షుడు శింగనమల ఉస్మాన్, వజ్రకరూరు అధ్యక్షుడు రవిరెడ్డి, రాగులపాడు మధురెడ్డి, ముష్టూరు రెడ్డి, చాబాల సర్పంచ్, పార్టీ జిల్లా నాయకులు జగదీష్, నారాయణప్ప, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు వడిత్య గోవిందునాయక్, శ్యాం పాల్గొన్నారు.

ఊరూరా విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు




బెల్టుషాపులో మద్యం విక్రయిస్తున్న వాటర్‌మెన్



ఉదయం 7 గంటలకే బెల్టు షాపు తీసిన దృశ్యం

బ్రహ్మసముద్రం: మండల వ్యాప్తంగా ఊరూరా విచ్చలవిడిగా బెల్టుషాపులు నడుస్తున్నాయి. మొత్తం 16 గ్రామ పంచాయతీల్లోని 33 గ్రామాల్లో దాదాపు 55కు పైగా బెల్టు దుకాణాలు నడుస్తున్నాయి. మండల కేంద్రంలో పంచాయతీ కొళాయిలకు నీరు సరఫరా చేసే వాటర్‌మెన్ ఏకంగా బెల్టు షాపు ఏర్పాటు చేసి, మద్యం అక్రమంగా విక్రయిస్తున్నాడు. గ్రామస్తులు ఇదేమని ప్రశ్నిస్తే.. అధికారులకు మామూళ్లు అందించి, మద్యం విక్రయిస్తున్నామని, అధికారంలో కూటమి ప్రభుత్వం ఉందని చెప్తున్నాడని స్థానికులు అంటున్నారు. విచ్చలవిడిగా బెల్టుషాపులు నడుస్తున్నా ఎక్సైజ్ అధికారులుగానీ పోలీసులుగానీ కన్నెత్తిచూడలేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు తగవు



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: వైఎస్సార్‌సీపీ నాయకులపై మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అనుచిత వ్యాఖ్యలు తగవని కళ్యాణదుర్గం నాయకులు మండిపడ్డారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఇటీవల వైఎస్సార్‌సీపీ నాయకులపై ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టక మహిళలు, బాలికలపై లైంగిక దాడులు అధికమయ్యాయన్నారు. రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లికి చెందిన దళిత బాలికకు న్యాయం చేయాలని డిమాండ్‌చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులపై మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు, నియోజవర్గం యూత్ వింగ్ చరణ్, మున్సిపాల్ విభాగం అధ్యక్షుడు దొడగట్ట మురళి, ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పేస్వామి, ఎరుకుల అజయ్, షేక్షా, ఓంప్రకాష్, గుబనపల్లి పాండు, వన్నూరస్వామి, బాబు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణశుక్రవార పూజలు




ప్రత్యేక అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు

రాయదుర్గం: నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో తొలిశ్రావణ శుక్రవారం పూజలు నిర్వహించారు. తొలి శుక్రవారం పట్టణంలోని వాసవీమాత ఆలయం, నేసేపేట, కల్లీమఠం హైస్కూల్ వద్దనున్న మహాలక్ష్మిదేవి, మల్లాపురం లేఅవుట్‌లోని గజలక్ష్మి ఆలయం, బన్నీ మహంకాళి, వాసవీ నగరేశ్వరస్వామి ఆలయాల్లో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు.డి హీరేహాళ్ మండలంలోని ఓబుళాపురం సమీపంలో జాతీయ రహదారికి ఆనుకొని వెలసిన మహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. పట్టణంలోని వాసవీ కన్యాకపరమేశ్వరి, కొండపై వెలసిన రేణుకా యల్లమ్మదేవి ఆలయాల్లోనూ పూజలు నిర్వహించారు. తొలి శ్రావణ శనివారానికి ప్రసిద్ధి చెందిన మురడి, నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు పలు శివాలయాలు ముస్తాబయ్యాయి.

సంక్షిప్త సమాచారం

రక్తపోటు పెరిగితే మాతాశిశువుకు ప్రమాదం

కూడేరు: గర్భిణుల్లో రక్తపోటు (బీపీ) పెరిగితే ఆరోగ్య సమస్యలు తలెత్తి మాతాశిశువుకు ప్రమాదమని మండల వైద్యాధికారిణి ఉషారాణి సూచించారు.. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గర్భిణులను డాక్టర్ ఉషారాణి పరీక్షించారు. సీహెచ్‌ఓ సరోజ, సూపర్‌వైజర్లు యశోద, రవీంద్ర, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు ‘బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ’

బెళుగుప్ప: మండల కేంద్రంలో శనివారం ‘బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ’ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ మచ్చన్న శుక్రవారం తెలిపారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ వ్యవసాయతోటలో మధ్యాహ్నం 2 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమానికి పార్టీ ఉరవకొండ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి హాజరవుతారన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచు లు, సీనియర్ నాయకులు, పార్టీ అనుబంధ కమి టీల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

వాహనాల వేలం

కళ్యాణదుర్గం రూరల్: కంబదూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జయనాథరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వేలంపాట నిర్వహించారు. మొత్తం 11 వాహనాలు వేలం వేయగా రూ.2,16,540 ఆదా యం వచ్చింది. కంబదూరు, కుందుర్పి పోలీస్ స్టేషన్ పరిధిలోని 35 కేసుల్లో కర్ణాటక మద్యం, 11 ఆంధ్ర మద్యం కేసుల్లో, రెండు కేసులు నాటుసారా ధ్వంసం చేశారు. వాటి విలువ రూ.21,4560 ఉంటుందన్నారు.ఎక్సైజ్ సీఐ సునిల్ కుమార్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

29న వాహనాల వేలం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ అక్రమ మద్యం రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 29న వేలం వేస్తున్నట్లు సీఐ సోమశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఎస్పీని ఆశ్రయించిన ప్రేమజంట



మాట్లాడుతున్న ప్రేమికులు

అనంతపురం: ‘మేము ఇష్టపూర్వకంగా పెళ్లి చేసుకున్నాం. రక్షణ కల్పించి స్వస్థలాలకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలి’ అని ఓ ప్రేమజంట శుక్రవారం ఎస్పీ జగదీష్‌ను కలిసి కోరింది. వివరాలు ఇలా.. ఉరవకొండ నియోజకవర్గం విడపనకల్లు మండలం మల్లాపురం గ్రామానికి చెందిన గోవిందు, వన్నూరమ్మ దంపతుల కుమార్తె హెచ్.గౌతమి, పొల్లూరు గ్రామానికి చెందిన శివప్ప, సుంకలమ్మ కుమారుడు ఎం.ఎర్రిస్వామి ఏడాదిన్నరగా ప్రేమించుకుంటున్నారు. ఎవరి ప్రమేయం లేకుండా ఇష్టపూర్వకంగా పెళ్లి చేసుకున్నారు. పెద్దలు పెళ్లికి అంగీకరించక పోవడంతో పెళ్లి చేసుకున్నారు. ఇద్దరూ మేజర్లు కావడంతో రక్షణ కల్పించాలని పోలీసులను కోరుతున్నారు.

జీడిపల్లి రిజర్వాయర్ వద్ద అప్రమత్తంగా ఉండాలి

బెళుగుప్ప: జీడిపల్లి రిజర్వాయర్‌కు కృష్ణాజలాలు వస్తున్నాయని, సందర్శకులు సమీప గ్రామస్తులు కూడా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ అనిల్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రిజర్వాయర్ వద్దకు ఈతకు వెళ్లరాదని, రామసాగరం, జీడిపల్లి గ్రామాల ప్రజల ఇళ్ల వద్దకు నీరు వచ్చినా, లేదా ఏదైనా ఘటనలు జరిగినా వెంటనే గ్రామ రెవెన్యూ, మండల తహసీల్దార్‌కు సమాచారం అందించాలని తెలిపారు.

రాయదుర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌గా గౌని ప్రతాప్‌రెడ్డి

రాయదుర్గంటౌన్: రాయదుర్గం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌గా గౌని ప్రతాప్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు విజయవాడలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తూ రాయదుర్గం ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించినట్లు ప్రతాప్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకంతో పార్టీ బాధ్యతలు అప్పగించిన పీసీసీ చీఫ్ షర్మిలా, డీసీసీ అధ్యక్షుడు మధుసూదనరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానన్నారు.

సామాజిక తనిఖీలపై గ్రామసభలు

గుమ్మఘట్ట: గతేడాది ఏప్రిల్ నెల నుంచి ఈ ఏడాది మార్చి ఆఖరు వరకు జరిగిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ బృందం ఈ నెల 27నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న భూపసముద్రం,75 వీరాపురం, 28న గొల్లపల్లి, 29న పూలకుంట, రంగసముద్రం, 31న గోనబావి, గలగల, కలుగోడు, ఆగస్టు 1వతేదీ బేలోడు, మారెంపల్లి, 2న తాళ్లకెర, సిరిగెదొడ్డి, కేపీ దొడ్డి, గుమ్మఘట్ట, నేత్రపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

తీరనున్న సుదూర పోలింగ్ కష్టాలు

- ప్రతి 1200 మందికి ఒక పోలింగ్ కేంద్రం
- నియోజకవర్గంలో అదనంగా ఏర్పడనున్న 47 కేంద్రాలు
- 343కు పెరగనున్న పోలింగ్ కేంద్రాల సంఖ్య



రాయదుర్గంలో గత సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

రాయదుర్గంటౌన్: నియోజకవర్గంలోని ఓటర్లకు సుదూర పోలింగ్ కష్టాలు తీరనున్నాయి. 1500 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఉండటంతో ఓటు వేసేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ఎక్కువ సేపు క్యూలో నిల్చొని అవస్థలు పడేవారు. ఇక నుంచి ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన అవసరం ఉండదు. ఎక్కడికక్కడ ప్రతి 1200 మంది ఓటర్లకు ఒక కేంద్రం ఏర్పాటు చేసేందుకు ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోంది. సమీపంలోనే పోలింగ్ కేంద్రం ఉండేలా చూడాలని ఎన్నికల సంఘం జీవో జారీ చేసింది.

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు

గ్రామ పంచాయతీ, పట్టణంలో 1200 మంది పైబడి ఓటర్లుంటే సమీప కేంద్రాల్లోకి చేర్చడం లేదా కొత్తగా మరో కేంద్రం ఏర్పాటు చేసి, సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఈసీ ఆదేశించింది. ఇప్పటికే సంబంధిత ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ ఈ మేరకు 1200 మంది ఓటర్లున్న పోలింగ్ కేంద్రాల జాబితా సేకరించి అవసరమైన మేరకు కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు నివేదించారు. రాయదుర్గం నియోజకవర్గంలోని ఒక మున్సిపాలిటీ, ఐదు మండలాల్లో కలిపి (రాయదుర్గం అర్బన్, రాయదుర్గం రూరల్, గుమ్మఘట్ట, డి.హీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్లు) ఉన్న 296 పోలింగ్ కేంద్రాలు ఉండగా 47 పోలింగ్ కేంద్రాల్లో 1200 మందికి పైగా ఓటర్లు ఉన్నట్లు గుర్తించారు.

కలెక్టర్ ఆమోదించిన తర్వాత ప్రక్రియ ప్రారంభం ..

మొత్తం 47 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉందని జిల్లా కలెక్టర్‌కు అధికారులు నివేదిక పంపించారు. కలెక్టర్ ఆమోదం తెలిపిన వెంటనే అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇప్పటికే అధికారులు క్షేత్రస్థాయి కసరత్తు మొదలుపెట్టారు. అదనంగా ఏర్పాటు చేయనున్న 47 పోలింగ్ కేంద్రాలతో నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రా సంఖ్య 343కు పెరగనుంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 1200 పైబడిన ఓట్లు ఒక పోలింగ్ కేంద్రం మేరకు నియోజకవర్గంలో అదనంగా 47 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపినట్లు స్థానిక ఎలక్షన్ డీటీ సుజాత తెలిపారు.